RNI Reg-No. APTEL/2002/07373

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

Postal Registration No.VJ/215/2025-27

## మద్యం కుంభకోణం కేసు..
## కొనసాగుతున్న విజయసాయిరెడ్డి విచారణ



హైదరాబాద్, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి): వైకాపా హయాంలో జరిగిన ఏపీ మద్యం కుంభకోణం మిగతా 2లో..

సంపుటి :24 Vol. No.24 సంచిక : 150 Issue No. 150 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 29-05-2026 Friday, May 29 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00



# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా... రైతులకు నేస్తం

- ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి
- యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు
- మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్

**అమరావతి, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని అడుగుతానని పేర్కొన్నారు. గురువారం రెండోరోజు మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళులు మిగతా 2లో..

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోదీ సమీక్ష



**న్యూఢిల్లీ, మే 28 (ఆర్ఎన్ఎ):** అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మిగతా 2లో..


# రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

- ఇది గుర్తించి అడుగులు వేసిన నేత చంద్రబాబు
- కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరంకు మహర్దశ
- కేంద్ర సాయంపై మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని



**అమరావతి, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి అని నమ్మిన నాయకుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి కోసం రూ.15,000 కోట్లు కేంద్ర బ్జడెట్‌లో కేటాయించిందని వివరించారు. చరిత్రలో ఎవరూ కదిలించలేని విధంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత తీసుకొచ్చామని గుర్తు చేశారు. గురువారం టీడీపీ మహానాడులో రాష్ట్రానికి కేంద్ర సహాయం అనే తీర్మానంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. రెండేళ్లలో రూ.20,000 కోట్ల రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకొచ్చామని మిగతా 2లో..

# ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి



**న్యూఢిల్లీ, మే 28 (ఆర్ఎన్ఎ):** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీయులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. పేదలకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించే దిశగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకితభావం నేటికీ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంది. చలనచిత్ర రంగానికి ఆయన అందించిన సేవలు తరతరాలను అలరిస్తూనే ఉన్నాయి. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

# పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలకు శ్రీకారం... 11లక్షల మంది మహానాడు కోసం రిజిస్టర్ చేశారు

మహానాడులో ఇష్టాగోష్టిగా మాట్లాడిన లోకేశ్



**అమరావతి, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరై.. మహానాడు మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవీకాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంతపరంగా తాము సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేశ్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సిఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేశ్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని నారా లోకేశ్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ మిగతా 2లో..

# ఎట్టకేలకు సిద్దరామయ్య రాజీనామా

గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత... అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన

జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



**బెంగళూరు, మే 28 (ఆర్ఎన్ఎ):** కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా మిగతా 2లో..

# సిద్ధరామయ్యకు డికె పాదాభివందనం

బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో ఘటన



**బెంగళూరు, మే28 (ఆర్ఎన్ఎ):** కర్నాటక కాంగ్రెస్‌లో మార్పు అనివార్యమయ్యింది. సిద్ధరామయ్య తన సీఎం పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బెంగుళూరులో ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. సీఎం సిద్ధరామయ్యను ఆలింగనం చేసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్ ఆ తర్వాత పాదాభివందనం చేశారు. సిద్ధరామయ్య కాళ్లను మొక్కి డీకే శివ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. గురువారం రాష్ట్ర గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ సిద్ధరామయ్య తీసుకున్నారు. ఉదయం తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు హాజరయ్యారు. శివకుమార్‌ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్న ఫోటోను సీఎంవో ఆఫీసు రిలీజ్ చేసింది. ఇక తర్వాత సిద్ధరామయ్య పాదాలను శివకుమార్ తాకారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల ప్రకారమే సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకున్నారు.

# సాగునీటి ప్రాజెక్టులకు టిడిపి పెద్దపీట

ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు సాగునీటికి ప్రాధాన్యం

నదుల అనుసంధానంపై మహానాడులో నిమ్మల వెల్లడి



**అమరావతి, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దూరదృష్టి మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## మద్యం కుంభకోణం కేసు.. కొనసాగుతున్న విజయసాయిరెడ్డి విచారణ

కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈడీ విచారణ కొనసాగుతోంది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో ఐదు గంటలుగా అధికారులు ఆయన్ను విచారిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే విజయసాయిరెడ్డి రెండుసార్లు విచారణకు హాజరయ్యారు. కుంభకోణానికి సంబంధించి జరిగిన విధాన నిర్ణయాలు, రహస్య ఆర్థిక లావాదేవీలపై ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. బ్యాంకు లావాదేవీలు, విజయసాయి అందించిన వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

## పార్టీలో మహిళా నాయకత్వానికి ప్రోత్సాహం

వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని నారా లోకేశ్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్ విసిరానని లోకేశ్ గుర్తు చేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు. జగన్.. ఆయన కుటుంబ చరిత్రను తవ్వి తీయించారన్నారు. రాజారెడ్డి చేసిన అరాచకాలు, బెరైటీస్ గనుల కోసం వాళ్లు ఎంతమందిని హత్య చేశారనేది జనానికి తెలియచేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని ఈ సందర్భంగా నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. తాను వైఎస్ జగన్ కాదని.. ఆయన లాగా తన వద్ద గొడ్డలి లేదంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంను ఉద్దేశించి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. 316 ఆర్వోబీ పాంట్లు,16 వందే భారత్ రైళ్లు, 73 అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.2,500 కోట్లతో అమరావతిలో రైల్వే ప్రాజెక్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధించామని చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆ ఐదేళ్లలో భోగాపురం ఎయిర్ పోర్టు కోసం కేవలం రూ.600 కోట్లు ఖర్చు చేస్తే... కూటమి ప్రభుత్వం రూ.4,000 కోట్లు ఖర్చు చేసి ప్రారంభానికి సిద్ధం చేసిందని వివరించారు. పూర్వోదయ పథకం కింద రాయలసీమలో రూ.40 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గూగుల్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ముద్ర వేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు కోసం కేంద్రం రూ.11,400 కోట్లు సాయం చేసిందని వివరించారు. ఉక్కును కరిగించవచ్చు కానీ.. ఆంధ్రుల సంకల్పాన్ని వైఎస్ జగన్ కరిగించలేడన్నారు. సంకెళ్లతో అమరావతిని గొడ్డలి పార్టీ బంధిస్తే.. సంకల్పంతో అమరావతిని సాధించామని స్పష్టం చేశారు. గోదావరి నీళ్లు సముద్రంలో కాకుండా రైతు జీవితాల్లో కలవాలనే లక్ష్యంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. 2014-19లోనే పోలవరం పనులు 70 శాతం పూర్తి చేశామని.. కానీ గత వైసీపీ ప్రభుత్వం కేవలం 5 శాతం పనులు మాత్రమే చేసిందని సోదాహరణంగా ఆయన వివరించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి 30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు.నాడు పంచాయతీ రాజ్ శాఖమంత్రిగా నారా లోకేశ్.. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి ఎంతో కృషి చేశారని పెమ్మసాని చంద్రశేఖర్ గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం పథకాలు సద్వినియోగ పరుచుకోవడంలో విఫలమయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రూ.12,000 కోట్లు చెల్లించి సుమారు 82 కేంద్ర పథకాలను పునరుద్ధరిం చామని వివరించారు. అమృత్ స్కీమ్ కింద కొత్తగా 2 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. నీళ్లు అందించడం సంక్షేమం కాదని.. ప్రభుత్వాల బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించలేక పోయారని పేర్కొన్నారు.

## ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది.

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తం

(మొదటి పేజీ తరువాయి)



అర్పించారు. 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేందప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పారు. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దానికి తిరుగు ఉండదన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరని.. ఆయన మొదట సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారని ప్రస్తావించారు. నీతి నిజాయితీతో ఆయన సినిమాల్లోకి వచ్చారని.. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిందని.. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టులకు టిడిపి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

అమోఘమని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. నీటిపారుదల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే పునాది వేశాయని పేర్కొన్నారు. జలం ఉన్న చోటే నాగరికత అభివృద్ధి చెందిందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మహానాడులో 'నీటిపారుదల అభివృద్ధి – నదుల అనుసంధానం'పై మంత్రి నిమ్మల మాట్లాడారు. పల్లెల నుంచి పట్టణాల నుంచి.. మహానగరాలుగా అభివృద్ధి చెందిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. ఈ సత్యాన్ని గ్రహించే.. అనాడు మాజీ సీఎం ఎన్టీఆర్ దగ్గర నుంచి.. నేటి చంద్రబాబు వరకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గురించి మాట్లాడాల్సి వస్తే.. తెలుగుదేశం పార్టీకి ముందు.. ఆ తర్వాత అనే విధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.18 వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. హంద్రీనీవా రాయలసీమ జీవనాడి అని.. అలాంటి హంద్రీనీవా గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫేజ్?1ను పూర్తి చేసి.. 727 కిలోమీటర్లకు సీఎం చంద్రబాబు కృష్ణ జలాలను తీసుకువెళ్లారని ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదభరితంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తే.. గొడ్డలిపార్టీ కనీసం పట్టించు కోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 2024లో తుంగభద్ర ప్రాజెక్టులోని 19వ గేటు కొట్టుకుపోతే కర్ణాటక ప్రభుత్వం కూడా ఏం చేయలేక పోయిందని చెప్పారు. సీఎం చంద్రబాబు అప్పటికప్పుడు జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడుకి ఫోన్ చేశారని వివరించారు. వరద కొనసాగుతుండగానే గేటు పునర్నిర్మాణం చేసి 80 టీసీఎంల నీటిని సముద్రం పాలు కాకుండా చూశారని అన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుంటున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదే రాయలసీమకు ఎందుకు గొడ్డలి పోటు వేశారో సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు.

# కల్తీ కి బ్రాండ్ అంబాసిడర్ జగన్

**జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ వ్యాధి లాంటివాడు.... టిడిపిలో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చారిత్రాత్మక నిర్ణయం**

**మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్**




**కాకినాడ, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైసీపీ అధినేత జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ వ్యాధి లాంటివాడని, అలాగే కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘాటుగా విమర్శించారు. మహానాడు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో అమలాపురం ఎంపీ హరీష్ మాధూర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, నియోజకవర్గ పరిశీలకు రాలు మజ్జి పద్మావతి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో రోజు హైబ్రిడ్ మహానాడు ఉత్సాహభరితంగా జరుగుతుందన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ అధిష్టానం పలు కీలక తీర్మానాలు చేయడం హార్షనీయమన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడంతోపాటు, సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశామన్నారు. స్త్రీ శక్తి పథకం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ, తల్లికి వందనం వంటి మహిళా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతుందని, దీనికి విరుద్ధంగా జగన్ తన తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన పరిస్థితి ఉందన్నారు. వైసీపీకు టిడిపి పార్టీకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని చమత్కరించారు. జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ వ్యాధి లాంటి వాడని, జే బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం, గంజాయి, అక్రమ మైనింగ్ లను పెంచి పోషించారన్నారు. కూటమి ప్రభుత్వం చరిత్రను తిరగరాస్తు 164 సీట్లు సాధిస్తే, జగన్ 154 సీట్ల నుంచి 11 సీట్లకు తగ్గించుకుని రికార్డు నమోదు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో 11 సీట్ల నుంచి ఒక సీటుకే పరిమితం అవుతారని జోస్యం చెప్పారు. టిడిపి పార్టీ కార్యకర్తల సంక్షేమం లక్ష్యంగా ఎవరైనా అకాల మరణం చెందితే ఐదు లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నామన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మాట్లాడుతూ రానున్న 2029 ఎన్నికల్లో తమ పార్టీ మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కోసం అధిష్టానం తీర్మానం చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం 33% అమలు చేసేందుకు చేసిన ప్రయత్నాలు విపక్షాల వల్ల అమలు కాకపోయినా, మహిళా సాధికారత లక్ష్యంగా టిడిపి ఈ నిర్ణయం తీసుకోవడం మహిళ లోకానికి ఇచ్చే గౌరవంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రంలో 1875 క్లస్టర్లలో విజయవంతంగా హైబ్రిడ్ మహానాడు రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది మాసాల్లోనే అధికారం చేపట్టిన ఎన్టీఆర్ ఆశయ సాధనలో సీఎం చంద్రబాబు నాయుడు, పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నడుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు మజ్జి పద్మావతి, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ వనుం వీరబ్రహ్మం, కో క్లస్టర్ దదాల సత్తిబాబు, రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, రేవు శ్రీను, సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. తదనంతరం టి.మామిడాడ, గొల్లపాలెం, వెల్ల లో జరిగిన మహానాడులో మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు.

# నాలుగు రాష్ట్రాలకు బిజెపి అధ్యక్షుల నియామకం

**న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ):** భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది.

తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.

## మహానాడు... "ప్రజల పండుగ"

- రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం టీడీపీ సంచలన నిర్ణయం
- వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు!
- స్త్రీ శక్తిని 'మహాశక్తి'గా మార్చే దిశగా లోకేష్ చరిత్రాత్మక తీర్మానం..
- జగన్‌పై సొంత పార్టీలో 'అసంతృప్తి
- రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు...



**కాకినాడ, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మహానాడు-2026', రాజకీయ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈసారి 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ వేడుక, మహిళా సాధికారతకు అద్దం పడుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మహానాడు వేదికగా చేసిన ప్రకటన రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందినా, పొందకపోయినా.. 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం అసెంబ్లీ, లోక్ సభ సీట్లు కేటాయించాలని తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కొనియాడారు. టీడీపీ భవిష్యత్తును నడిపించడంలో మహిళలు పురుషులతో సమానంగా అడుగులు వేయాలి. మనకు మరింత మంది మహిళా చట్టసభ సభ్యులు అవసరం" అని నారా లోకేష్ చేసిన పిలుపు మహానాడులో ప్రధానాకర్షణగా నిలిచింది. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీలకు మార్గదర్శకంగా నిలుస్తుందని సానా సతీష్ బాబు తెలిపారు. మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది తెలుగు ప్రజలందరి పండుగని ఆయన పేర్కొన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడుకు కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.

**జగన్‌పై సొంత పార్టీలో 'అసంతృప్తి సెగలు**

మరోవైపు, ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి తీరుపై ఎంపీ సానా సతీష్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ తీసుకుంటున్న నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడంతో ఆయన సొంత పార్టీ కార్యకర్తలే అసహనానికి గురవుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా అభద్రతా భావంతో ఉన్న జగన్, రోజురోజుకూ ప్రజల్లో పట్టు కోల్పోతున్నారని విమర్శించారు. ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేని నిర్ణయాలు తీసుకుంటూ, తన పార్టీని జగన్ గందరగోళంలోకి నెట్టేస్తున్నారు" అని ఎంపీ ఎద్దేవా చేశారు.

## ప్రజాపక్షం వహించిన నేత ఎన్టీఆర్

**ఎక్స్ వేదికగా పవన్ నివాళి**

**అమరావతి, మే 28 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం ఓ పోస్టు పెట్టారు. 'కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని రాజకీయ జీవితంలోకి వచ్చి- ప్రజాపక్షం వహించిన దివంగత నేత ఎన్టీరామారావు గారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేనివి. ఎన్టీ రామారావు గారు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. రూ.2లకే కిలోబియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోంది' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కర్నాటకలో సిఎం పదవి మూన్నాళ్ల ముచ్చటే

**ఐదేళ్లు నికరంగా పనిచేసిన వారు ముగ్గురే**

**ఒడిదుడుకుల రాజకీయంలో ఐదేళ్లు నిలబడని నేతలు**

**బెంగళూరు,మే28(ఆర్ఎన్ఎ):** కర్ణాటకలో సీఎం మార్పుపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. 2023లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు ఆ కుర్చీని వదులుకోవడం ఖాయమయ్యింది. తన రాజీనామాను ఆయన గవర్నర్ కార్యదర్శికి అందచేశారు. దీంతో డికె శివకుఆర్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం.. డీకే కొత్త సీఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనే ఖరారయితే ఆయన పదవిలో రెండేళ్లు మాత్రమే ఉంటారు. అసలు కర్ణాటకలో పూర్తి పదవీకాలం సీఎం సీటులో కొనసాగడం ఒక ఘనత అనే చెప్పవచ్చు. 1956 నుంచి కేవలం ముగ్గురు నేతలు మాత్రమే పూర్తికాలం పదవిలో కొనసాగారు. కాంగ్రెస్ నేత ఎస్. నిజలింగప్ప రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో ఏడాదికిపైగా ఆ పదవిలో ఉన్న ఆయన.. 1962లో మరోసారి ఆ బాధ్యతలు స్వీకరించారు. 1968 వరకు అంటే ఐదేళ్ల 345 రోజులు అధికారంలో కొనసాగారు. అదేపార్టీకి చెందిన డి. దేవరాజ్ అర్స్ 1972 నుంచి 1977వరకు, తర్వాత సిద్ధరామయ్య 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం ముఖ్యమంత్రులుగా కొనసాగారు. అయితే 1973 వరకు మైసూరు రాష్ట్రంగానే ఉండేది. అనంతరం కర్ణాటకగా పేరు మార్చారు. ఇదిలాఉంటే.. కర్ణాటకలో అతి తక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని సందర్భాల్లో ఎన్నికల అనంతరం పొత్తులు కుదిరినా.. అవి నిలబడలేదు. దాంతో ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. 2007లో యడియూరప్ప కేవలం వారం రోజులే సీఎం పదవిలో ఉన్నారు. భాజపా-జేడీఎస్ కూటమిలో సయోధ్య లేక ప్రభుత్వం కూలిపోయింది. వీరేంద్రపాటిల్ రాజీనామా చేయడంతో 1971లో కొన్నివారాల పాటు ఎస్ఆర్ కాంతి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్-జేడీఎస్ నేతృత్వం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ధరమ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఏడాదిపైగా ఆ కుర్చీలో కొనసాగినా.. కూటమిలోని వైరుధ్యాలతో ఆ ప్రయాణం సవ్యంగా సాగలేదు. దాంతో ఆయన 2006లో పదవిని కోల్పోయారు. పార్టీలో అంతర్గత రాజకీయాల కారణంగా భాజపా సదానందగౌడను పక్కనపెట్టడంతో 2012లో జగదీశ్ శెట్టర్ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత అసెంబ్లీ గడువు ముగిసింది.

VASTU HOUSING FINANCE

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

యూనిట్ నెం. 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బండర్ రోడ్,సెవ్రి (వెస్ట్), ముంబయి - 400015,మహారాష్ట్ర.
సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**సవరణ ప్రకటన**

24.05.2026 తేదీన స్కైలైన్ & నేతిమానదేశం (విజయవాడ ఎడిషన్ వార్తాపత్రిక)లో, క్రమ సంఖ్య 3 వద్ద సిద్ధయ్య కొడూరు, శ్రీ/శ్రీమతి రామ్మజ బీ మరియు శ్రీ/శ్రీమతి డి. పెద్దా మౌలాలి పేర్ల మీద ప్రచురించబడిన స్వాధీనపు నోటీసుకు సంబంధించి, LAN నంబర్ తప్పుగా LP0000000016937గా పేర్కొనబడింది. సరైన LAN నంబర్ "LP0000000176898"గా ఉండాలి.
సదరు స్వాధీనపు నోటీసులోని మిగిలిన అన్ని నిబంధనలు మరియు షరతులు యథాతథంగా కొనసాగుతాయి.

తేదీ : 29.05.2026
స్థలం : కర్నూలు

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు!

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతులు ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస్, లెఫ్ట్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగనుంది. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుగడలు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలిక కారణంగా మద్దతు నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్‌లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక వర్గం అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్షియాలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ):** అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ ధరలు పడిపోవడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో భారత మార్కెట్‌లో పసిడి ధరలు దిగివచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు పుంజుకుంటున్నాయి. దీంతో బంగారం, వెండి ధరలు దిగి వచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,060గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2230 మేర తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,050గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.2050 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా భారీ తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు పదివేల రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,85,000గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,75,000గా ఉంది.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

### భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా... 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు




**మాస్కో,మే28(ఆర్ఎన్ఎ):** రష్యా–ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి.మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి.

ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించ లేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# పెట్రో ధరలతో సామాన్యులపై భారం

### రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి లెఫ్ట్ సిద్ధం.... జూన్1 నుంచి 7 వరకు ప్రజాచైతన్య కార్యక్రమం



**విజయవాడ,మే28(ఆర్ఎన్ఎ):** క్రమంగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ ధరలు.. సామాన్యులకు భారంగా మారుతున్నాయి.. దీనితో అన్ని వస్తువులపై వీటి ప్రభావం పడుతోంది.. విజయవాడలో వామపక్ష పార్టీలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలు దశల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. లెఫ్ట్ పార్టీల ప్రెస్ మీట్‌లో మీడియాతో మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు.. రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక పన్నుల వల్లే ఇంధన ధరలు భారీగా పెరుగుతున్నాయని విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష నేతలు వెల్లడించారు. అనంతరం జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా పాసర్లపూడిలోని కేజీ బేసిన్ ప్రాంతాన్ని కూడా సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రోజూ పెట్టుబడులు, కంపెనీలు, ఉద్యోగాల పేరుతో ప్రకటనలు చేస్తూ హడావిడి చేస్తున్నారని, కానీ ధరల పెరుగుదల వల్ల ఎంత మంది ఉపాధి కోల్పోయారో లెక్కలు చెప్పాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధరలు తగ్గించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు పొదుపు చర్యల పేరుతో ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పొదుపు చర్యలను ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబులే పాటించడం లేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేసిన వామపక్ష నేతలు, ఇప్పుడు ఎందుకు ఆ హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు తగ్గించకపోవడం ఏమిటని నిలదీశారు. అంతే కాదు.. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను తక్షణమే తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే మహానాడులోనే ఇంధన ధరల తగ్గింపుపై తీర్మానం చేయాలని కోరాయి.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే వనరుల్లో 50 శాతం రాష్ట్ర ప్రజల అవసరాలకు వినియోగించేలా ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ ధరలను పాత ధరలకే అందించాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని, వెంటనే కేంద్రం మరియు రాష్ట్రం ప్రజలకు ఊరట కలిగించే చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయి.

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

### అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

**టెహ్రాన్,మే28(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా– ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

## ఎన్టీఆర్‌ది చెరిగిపోని సంతకం

### ఎక్స్ వేదికగా చిరంజీవి నివాళి

**హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ):** ఎన్ని తరాలు మారినా మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా చిరంజీవి ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు'.. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా.. ప్రజా జీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయులు. ఇటీవల ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నాకు లభించడం కూడా ఎంతో ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నాను. అది ఆయనపై నాకు ఉన్న గౌరవానికి మరింత విలువైన గుర్తింపుగా నిలిచిపోతుంది. ఆ మహనీయుని జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ..' అని రాసుకొచ్చారు.

## బలమైన ఈదురుగాలులు

### గంగా నదిలో పడవబోల్తా పడి ఇద్దరు మృతి

**పాట్నా,మే28(ఆర్ఎన్ఎ):** పాట్నా జిల్లా బర్హ్ సబ్–డివిజన్‌లోని ఉమానాథ్ గంగా ఘాట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. గంగా నదిలో ప్రమాదవశాత్తూ పడవ బోల్తాపడి ఇద్దరు మృతిచెందగా.. ఐదుగురు గల్లంతయ్యారు. బలమైన గాలుల కారణంగా పడవ బోల్తా పడినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. గంగా ఘాట్ వద్దకు వచ్చిన సుమారు 14 నుంచి 15 మంది నది అందాలను చూసేందుకు పడవ ఎక్కారు. గంగా నది మధ్యలోకి వెళ్లగానే ఒక్కసారిగా బలమైన గాలులు వీచాయి. దీంతో ఒక్కసారిగా పడవ బోల్తా పడింది. కాపాడాలంటూ బాధితులు కేకలు వేశారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బోట్ల సహాయంతో ఐదుగురిని రక్షించగా.. మిగతా వారంతా గల్లంతయ్యారు. బోట్ల యజమానుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలనూ రంగంలోకి దింపారు. గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే, ఇద్దరి మృతదేహాలు లభించాయని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బర్హ్ ఎస్‌డీపీవో రామకృష్ణ తెలిపారు.

# మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

### టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ... తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

### తెలుగుదేశంపై మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు

**తిరుపతి,మే28(ఆర్ఎన్ఎ):** తెలుగుదేశం పార్టీ, మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు .. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును లక్ష్యంగా చేసుకుని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఒక 'బోగస్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించిన రోజా, ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెప్పుకుంటున్నప్పటికీ మహానాడును చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అందుకే రికార్డ్ డ్యాన్సులు వేసి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని అంటూ ఎద్దేవా చేశారు. మహానాడును ఉద్దేశించి 'ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, భూతునాడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, చంద్రబాబు.. హెరిటేజ్ ఆస్తుల్లో తన తల్లి, చెల్లికి ఎంత ఆస్తులు ఇచ్చారో చెప్పగలరా అని రోజా ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. తల్లికి, చెల్లికి సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా అని విమర్శించారు. ఈ దేశంలో జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు మరెవ్వరూ ఇవ్వలేదని రోజా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై కూడా రోజా స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వివేకా హత్య జరిగిందని గుర్తుచేస్తూ, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి లాయర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారని, వెన్నుపోటు పొడిచారని, ఆయన పార్టీని దొంగతనంగా లాక్కున్నారని ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే పవన్ కల్యాణ్ తల్లిని తిట్టించింది కూడా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. మరోవైపు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, అయితే అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రోజా విమర్శించారు. టీడీపీకి నిజంగా దమ్ముంటే మహానాడులో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా?' అని ఆమె సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికే 2023 అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎప్పుడో ప్రకటించారని రోజా తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రోజా ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు అడ్డదిడ్డంగా పెంచుతున్నారని విమర్శించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

### గొల్లపూడిలో ఎన్టీఆర్ విహానికి దేవినేని నివాళి... ఆత్మగౌరవాన్ని పరిచయం చేసిన మహానేత అని అంజలి



**విజయవాడ,మే28(ఆర్ఎన్ఎ):** మాజీ సీఎం నందమూరి తారక రామారావు 103వ జయంతిని గొల్లపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు. ఎన్టీఆర్‌కు పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసి రాజకీయ రంగంలో ధ్రువతారగా వెలిగారని ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 'ఆత్మగౌరవాన్ని' పరిచయం చేసిన ధీరుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కేవలం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడని ఉద్ఘాటించారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయకత్వంలో పార్టీని కాపాడి.. 44 ఏళ్లుగా బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని దేవినేని ఉమ వ్యాఖ్యానించారు. 1994లో ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ ఘన విజయం సాధించడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 'మీకోసం వస్తున్నా' పాదయాత్రతో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి 2014లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చారని ప్రస్తావించారు. అసత్య ప్రచారాలతో వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని విమర్శించారు. గుడివాడ వైసీపీ నేతలు ఇప్పటికీ అడ్డూ అదుపూ లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

మహిళలను అవమానించిన, దుర్భాషలాడిన వైసీపీ నేతలకు ప్రజలే గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ఉద్ఘాటించారు.

కూటమి ప్రభుత్వం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి.. 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు వెళ్తోందని దేవినేని ఉమ తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదాన్ని, చంద్రబాబు ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతికి చాటారని వెల్లడించారు. యువగళం ద్వారా లోకేశ్ మూడోతరం నాయకత్వాన్ని నిరూపించుకుని పార్టీని విజయపథంలో నడిపిస్తున్నారని చెప్పారు. నందమూరి బాలకృష్ణ హిందూపురంలో అభివృద్ధి పనులు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా మరిన్ని సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, ఆరోగ్యం, బ్లడ్ బ్యాంక్, సంజీవని వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సమన్వయంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

# మినరల్ వాటర్ వేడి చేసి తాగవచ్చా?



శీతాకాలం మరియు వర్షాకాలం ప్రారంభం కావడంతో, జ్వరం, జలుబు, తలనొప్పి, అనారోగ్యాలు, ఉబ్బసం మరియు తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతూనే ఉంటాయి. ఆ సందర్భాలలో నీరు ఎక్కువ దాహంతో పడుతుంది. మీరు ఎంత శుభ్రమైన నీరు తాగినా, మీరు ఎప్పటికీ సంతృప్తి చెందరు. ఆ సమయంలో మన నాలుకకు వేడి నీటిని త్రాగడం తప్ప వేరే మార్గం ఉండదు.

**చల్లని, వర్షాకాలం**

చలి మరియు వర్షాకాలంలో మీరు ఎంత నీరు తాగినా, గొంతులో పొడి పెరుగుతూనే ఉంటుంది. ఇలాంటి సమయాల్లో దాహం కోసం వేడినీరు తాగుతారా? వీటికి కలుషితమైన నీరు అనుమానంతో సాధారణ నీరు తాగాలా లేక మినరల్ వాటర్ తాగాలా అనే గందరగోళం మీకు ఉంటుంది. మీరు దాని గురించి ఇక్కడ తెలుసుకోచ్చు.

**మినరల్ వాటర్ వేడి చేయవచ్చా?**

మన శరీరానికి అవసరమైన ఖనిజాలు, మినరల్ లవణాలు మరియు శుద్ధి చేసిన లవణాలతో కలిపి మినరల్ వాటర్ వేడిచేసి త్రాగితే, దానిలోని అన్ని పోషకాలు పోతాయి అని మనలో కొందరు వినే ఉంటారు. కాబట్టి నిజం ఏమిటి?

**శుద్ధి చేసిన నీరు**

సాధారణంగా మనం బయట నీరు కొని తాగుతాం. కొన్ని నిర్దిష్ట బ్రాండ్లు మినహా అన్నీ ఆర్ఒ అది శుద్ధి చేసిన నీరు. మనలో కొందరు కొన్ని వేలు ఖర్చు చేసి మన సొంత ఇళ్లలోనే ఇన్‌స్టాల్ చేసుకుంటారు. అంటే మనం తాగడానికి శుద్ధి చేసిన నీటిని ఉపయోగిస్తున్నాం. **పోషకాలు అయిపోతాయా?**

శుద్ధి చేసిన నీటిలో ఉన్న అధిక భాస్వరం లాంటి లవణాలు శుద్ధీకరణ సమయంలో విడుదలవుతాయి. అది కాకుండా ఇతర పోషకాలు విడుదల చేయబడవు. భాస్వరం ముగిసిన తర్వాత, ఇది సాధారణ తాగునీటిలా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని సాధారణ నీటి మాదిరిగానే వేడి చేయవచ్చు. అందువలన పోషకాలు విడుదల చేయబడవు.

**బాక్టీరియా**

నీటిని మళ్లీ మళ్లీ వేడి చేయవచ్చా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. మీరు మళ్లీ వేడి చేసి త్రాగవచ్చు. తద్వారా నీటిలోని పోషకాలు విడుదల కావు. సాధారణంగా మనం ఒక విషయం అర్థం చేసుకోవాలి. నీరు బాహ్య మాధ్యమం లాంటిది. వేడి మరియు గాలి దానిపై పడినప్పుడు, అవి నీటిని ప్రభావితం చేయటం ప్రారంభిస్తాయి. నీటిలో గాలి మరియు వేడి బ్యాక్టీరియా ఏర్పడటం ప్రారంభిస్తుంది. ఇది సాధారణ నీరు, శుద్ధి చేసిన నీరు మరియు మినరల్ వాటర్‌కు వర్తిస్తుంది.

**ఎంత సమయంలో**

మీరు వాటర్ బాటిల్ లేదా మినరల్ వాటర్ బాటిల్ తెరిచిన తర్వాత 24 గంటల్లో వాడటం మంచిది. లేకపోతే అందులో బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. అందుకే మినరల్ వాటర్ బాటిల్స్ కూడా మళ్లీ తాగి విస్మరించాలని, తిరిగి వాడకూడదని వారు అంటున్నారు.

**ఎత్తైన ప్రాంతాలలో**

సాధారణంగా నీటి శుద్ధీకరణ వ్యవస్థ పాశ్చాత్య దేశాలకు మరియు మన దేశాల మధ్య చాలా తేడాలు కలిగి ఉంది. ఎత్తైన ప్రదేశాలలో, స్వచ్ఛమైన జలపాతాల నుండి నీరు శుద్ధి చేయబడి, అవసరమైన నిష్పత్తిలో సోడియం, పొటాషియం, మెగ్నీషియం మరియు కాల్షియం వంటి ఖనిజాలతో కలుపుతారు. అది నిజంగా మినరల్ వాటర్. స్వేదన మినరల్ వాటర్ తాగవద్దు. ఇటువంటి స్వేదనం అదనపు ఖనిజాలను పనికిరానిదిగా చేస్తుంది.

# జీలకర్ర నీరు – ధనియా వాటర్ బరువు తగ్గడానికి ఏది ఉత్తమమైనది?





ఊబకాయంతో బాధపడేవారు దీన్ని తగ్గించడానికి కఠినమైన ఆహారం పాటిస్తారు. కొన్నిసార్లు కఠినమైన ఆహారం విసుగును కలిగిస్తుంది. ఆ సమయంలో బరువు తగ్గడానికి మరొక మార్గం ఉంటే అది సాధారణ ఇంటి నివారణలు. సాధారణంగా ఇంటి నివారణలు ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఇంట్లో సులభంగా మరియు చౌకగా తయారు చేసుకోవచ్చు. తరచుగా మనం చేసే మొదటి పని ఏమిటంటే, మనం రోజూ ఎదుర్కొనే కొన్ని నొప్పులకు చేతి నివారణలు చేయడం. ఆ విభాగంలో ఇంటి నివారణలలో బరువు తగ్గడం గురించి మాట్లాడుతూ, బరువు తగ్గడానికి మీకు సహాయపడే రెండు సాధారణ నివారణలు ఉన్నాయి. అవి జీలకర్ర మరియు కొత్తిమీర. ఈ రెండూ రోజువారీ వంటలో ముఖ్యమైన అంశం. ఈ రెండు విత్తనాలు జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి శరీర జీవక్రియను పెంచడం వరకు అనేక సమస్యలను పరిష్కరించగలవు. ఈ వ్యాసంలో మనం చూడబోయేది జీలకర్ర, ధనియాలు– ఈ రెండింటిలో బరువు తగ్గడానికి ఉత్తమమైన పానీయం ఏమిటో చూద్దాము.

**జీలకర్ర నీరు**

జీలకర్రను కొన్ని గంటలు నీటిలో నానబెట్టడం ద్వారా జీలకర్ర నీరు లభిస్తుంది. జీలకర్రను నీటిలో నానబెట్టినప్పుడు, ఓస్మోటిక్ ప్రక్రియ ద్వారా నీరు విత్తనాలలోకి ప్రవేశిస్తుంది. ఈ విధంగా ప్రవేశించిన తరువాత, జీలకర్ర అవసరమైన పోషకాలను నీటిలోకి విడుదల చేస్తుంది, నీరు లేత పసుపు రంగులోకి మారుతుంది.

**కేలరీలు తక్కువగా ఉంటాయి**

ఒక టీస్పూన్ జీలకర్ర కేవలం 7 కేలరీలు కలిగి ఉంటుంది. కాబట్టి మీరు జీలకర్ర నీటి ఒక గ్లాసు తాగినప్పుడు, శరీరం చాలా తక్కువ కేలరీలను మాత్రమే బర్న్ చేస్తుంది.

**అద్భుతమైన జీర్ణక్రియ**

జీలకర్ర జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు జీర్ణక్రియకు సహాయపడుతుంది. జీలకర్ర నీరు ఒకరకమైన ఎంజైమ్‌ను స్రవిస్తుంది. చక్కెరలు, కొవ్వులు మరియు కార్బోహైడ్రేట్లను విచ్ఛిన్నం చేయడానికి మరియు గౌట్ ను ఆరోగ్యంగా ఉంచడానికి ఇది సహాయపడుతుంది. ఒకరి జీర్ణవ్యవస్థ బాగా ఉంటే, బరువు బాగా తగ్గుతుందని మనందరికీ తెలుసు. ఎందుకంటే మంచి జీర్ణక్రియ శరీర జీవక్రియను పెంచుతుంది మరియు శరీర బరువును తగ్గించటానికి సహాయపడుతుంది.

**కొవ్వు కరిగిపోతుంది**

జీలకర్ర శరీరంలో కొవ్వులను కాల్చే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఈ విధంగా, ఈ విత్తనాలను నీటిలో నానబెట్టి త్రాగినప్పుడు, శరీరంలోని అదనపు కొవ్వులు కరిగిపోతాయి మరియు శరీరం వేగంగా బరువు తగ్గుతుంది.

**ఆకలిని నియంత్రించడం**

బరువు తగ్గాలనుకునేవారికి, వారు తమ లక్ష్యాన్ని చేరుకోలేకపోవడానికి ఒక కారణం ఏమిటంటే వారు వారి ఆకలిని నియంత్రించలేరు. అయినప్పటికీ, ఒకదాన్ని సొంతం చేసుకోవడం ఇప్పటికీ సగటు వ్యక్తికి మించినది కాదు. కానీ మీరు జీలకర్ర నీరు త్రాగినప్పుడు, ఆకలి భావన నియంత్రించబడుతుంది మరియు ఇది ఎక్కువ సమయం కడుపు నిండుగా ఉంచుతుంది మరియు జంక్ ఫుడ్స్ తినకుండా నిరోధిస్తుంది.

**శరీరాన్ని శుభ్రపరుస్తుంది**

జీలకర్ర శరీరంలోని హానికరమైన విషాన్ని బయటకు తీయడానికి సహాయపడుతుంది మరియు శరీరం కొత్త మరియు ఆరోగ్యకరమైన కణాలను ఉత్పత్తి చేయడానికి అనుమతిస్తుంది.

**ధనియా నీరు**

కొత్తిమీర తయారు చేయడం చాలా సులభం. ఒక టీస్పూన్ ధనియాలను ఒక టంబ్లర్ నీటిలో రాత్రిపూట నానబెట్టి, మరుసటి రోజు ఉదయం నిద్రలేచిన వెంటనే ఖాళీ కడుపుతో త్రాగాలి. ప్రధానంగా నీటిలో నానబెట్టిన విత్తనాలను విసిరివేయవద్దు. మీరు వాటిని వంటలో ఉపయోగించవచ్చు.

**ధనియా వాటర్ ప్రయోజనాలు:**

**రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది**

ప్రస్తుతం మనమందరం మన రోగనిరోధక శక్తిని బలంగా ఉంచుకోవలసి వస్తుంది. దానికి ధనియాలు చాలా సహాయపడుతుంది. కొత్తిమీరలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ–రాడికల్స్ కార్యాచరణను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**జీర్ణక్రియకు సహాయపడుతుంది**

మంచి జీర్ణక్రియ విజయవంతమైన బరువు తగ్గించే ప్రయాణంలో మొదటి దశ. ధనియాలు జీర్ణ లక్షణాలను కలిగి ఉంటుంది మరియు జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి అనేక ఔషధాలలో ఉపయోగిస్తారు.

**విషాన్ని తొలగిస్తుంది**

ధనియాలు, జీలకర్ర వంటిది శరీరంలోని విషాన్ని బయటకు నెట్టివేస్తుంది. ప్రతి రోజు ఉదయం ధనియా వాటర్ తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్లి శరీరమంతా ఆరోగ్యంగా ఉంటుంది.

**ఆకలిని తగ్గిస్తుంది**

ప్రతి ఉదయం ధనియా వాటర్ ఒక గ్లాసు తాగడం వల్ల ఆకలిని నియంత్రించవచ్చు మరియు అతిగా తినడం నివారించవచ్చు. అందువల్ల, ఊబకాయం ఉన్నవారు ధనియా వాటర్ తాగితే, వారి ఆకలి తగ్గుతుంది మరియు వారు సులభంగా బరువు తగ్గవచ్చు.

**ఫలితాలు**

కొత్తిమీర మరియు జీలకర్ర రెండూ బరువు మార్పులకు కారణమవుతాయి మరియు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించే పోషకాలను కలిగి ఉంటాయి. ఈ రెండూ ఇలాంటి ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా శరీర బరువు తగ్గించడానికి సహాయపడుతుంది. కాబట్టి మీరు ప్రతిరోజూ అదే మొత్తంలో జీలకర్ర వాటర్ తాగడం అలసిపోతే మీరు వీటిలో దేనినైనా ఎంచుకోవచ్చు లేదా ధనియా వాటర్ త్రాగవచ్చు.

# సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

## చంద్రబాబు దార్శనిక పాలన... మహానాడులో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి,మే28(ఆర్ఎన్ఎ):** ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ జగన్ పూర్తిగా పక్కన పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం జరిగిన మహానాడు సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా దక్షతతో అటు సంక్షేమానికి, ఇటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వల్ల వెంటిలేటర్ మీదకు వెళ్లిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 24 నెలల కాలంలోనే చంద్రబాబు మళ్లీ గాడిలో పెట్టారని కొనియాడారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఇచ్చిన మాట ప్రకారం హంద్రీనీవాకు నీళ్లు ఇచ్చాం. అంతేకాకుండా, రూ. 1,500 కోట్లు ఖర్చు పెట్టి ఈ ఏడాది మొదటి దశలోనే అనకాపల్లి వరకూ గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు శరవేగంగా పూర్తి చేశాం. వెన్నుపోటు, గొడ్డలిపోటు రాజకీయాల గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి, వారిని దారుణంగా వంచించిన విషయం అందరికీ తెలుసు. గొడ్డలిపోటుకు, వెన్నుపోటుకు నిజమైన పేటెంట్ హక్కు జగన్‌కే దక్కుతుంది. నాడు లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో అడుగడుగునా జగన్ అడ్డుపడ్డారని, అక్రమ కేసులు పెట్టి కూటమి నాయకులను, కార్యకర్తలను తీవ్రంగా వేధించిన కుటిల రాజకీయం నీది. ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పినా జగన్ మారలేదని, ప్రజలపై పగ పట్టినట్లు వ్యవహరిస్తున్నారు' అని అన్నారు.

# ఏపీ మద్యం కుంభకోణం కేసు.. వాసుదేవరెడ్డిని విచారిస్తున్న ఈడీ



**హైదరాబాద్:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2గా ఉన్న వాసుదేవరెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. నాలుగు గంటలుగా విచారణ కొనసాగుతోంది. వైకాపా మద్యం ముఠాతో కలిసి కుట్రకు రూపకల్పన, అమలులో ఆయన ప్రధాన పాత్ర పోషించారని ఇప్పటికే సిట్ తేల్చిన విషయం తెలిసిందే. 2019 కంటే ముందువరకూ ఆటోమేటెడ్ విధానంలో ఉన్న మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థను విధ్వంసం చేసి, ఆ స్థానంలో మాన్యువల్ విధానాన్ని ప్రవేశపెట్టటం ద్వారా కుంభకోణానికి దారులు తెరిచారని వెల్లడించింది.

# పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య

## సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం

**వాషింగ్టన్, మే 28(ఆర్ఎన్ఎ):** అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ పాత్రపై అగ్రరాజ్య సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం వ్యక్తం చేశారు. పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం నేపథ్యంలో పాకిస్థాన్ నిష్పాక్షిక మధ్యవర్తిగా వ్యవహరించలేదని గ్రాహం అభిప్రాయపడ్డారు. ఇరాన్‌తో శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపుపై పాకిస్థాన్ ఆసక్తి కనబరచలేదు. అబ్రహం ఒప్పందాల్లో చేరేది లేదని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో పాక్‌పై గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే దేశం మధ్యవర్తిగా వ్యవహరించడం మరింత సమస్యాత్మకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ సుదీర్ఘ కాలంగా ద్వేషంతో రగిలిపోతోంది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గతంలో పాక్ ఉన్నత స్థాయి అధికారులు చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరంగా ఉన్నాయి. అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని ట్రంప్ ఇచ్చిన పిలుపునకు పాక్ వెంటనే సమాధానం ఇవ్వాలి. పాక్ ఎయిర్‌బేస్‌లో ఇరాన్ సైనిక విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు ఇటీవల వచ్చిన వార్తలు అవాస్తవాలని కొట్టిపారెయ్యలేం' అని గ్రాహం పేర్కొన్నారు.

# ఉగాండా మహిళలో ఎబోలా లక్షణాలు

## బెంగళూరుకు చేరుకున్న వెంటనే పరీక్షలు

## ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స

**బెంగళూరు,మే28(ఆర్ఎన్ఎ):** ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్న క్రమంలో బెంగళూరులో ఉగాండాకు చెందిన మహిళకు ఈ వ్యాధి లక్షణాలు కన్పించాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ మహిళ (28) ఈనెల 23న ఉగాండా నుంచి కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు అధికారులు స్క్రీనింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఆ మహిళలో ఈ వ్యాధికి సంబంధించి తేలికపాటి లక్షణాలను గుర్తించారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. రెండు రోజుల్లో వీటి ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కర్ణాటక ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిత్విక్ రంజన్‌పాండే దీనిపై మాట్లాడారు. ప్రస్తుతం ఆ మహిళ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉందన్నారు. ఆమెలో కన్పించిన లక్షణాలు ఎబోలాకు సంబంధించినవేనా.. కాదా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేమన్నారు. ఈ సందర్భంగా సదరు మహిళలో ఒళ్లునొప్పులు, అలసట వంటి లక్షణాలను ఎయిర్‌పోర్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆమెను బెంగళూరు ఇందిరానగర్‌లోని ప్రభుత్వ అంటువ్యాధుల ఆస్పత్రికి తరలించి ఐసోలేట్ చేశారు. మహిళకు ఇప్పటివరకు ఎబోలా వ్యాధి నిర్ధారణ కానప్పటికీ ఆస్పత్రి సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఎబోలా నిర్ధారించేందుకు పరీక్ష నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)కి తరలించారు. కాగా, మరో రెండు రోజుల్లో ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.మరోవైపు భారతదేశంలో ఎబోలా వైరస్ వ్యాధి కేసులు నమోదు కాలేదని, ప్రయాణికురాలి పరిస్థితి నిలకడగానే ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవల ఎబోలా వైరస్ వ్యాప్తి చెందిన దృష్ట్యా భారత ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది' ఓ ప్రకటనలో పేర్కొంది.

# మోపాల్ మండలంలో చిరుత సంచారం

## గ్రామ శివారులో సంచరించినట్లు గుర్తింపు

**నిజామాబాద్,మే28(ఆర్ఎన్ఎ):** జిల్లాలోని మోపాల్ మండలంలో చిరుత పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని సిరిపూర్ గ్రామంలో రాత్రి వేళ చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామ శివార్లలో ఉన్న ఒక పశువుల పాక సమీపంలోకి చిరుత రావడాన్ని గమనించిన ఓ కుక్క గట్టిగా మొరగడంతో, చిరుత అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్ళిపోయింది. అయితే, ఈ దృశ్యాలన్నీ స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టంగా రికార్డు కావడంతో సిరిపూర్ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావడానికి, పొలాలకు వెళ్లడానికి రైతులు, కూలీలు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి చిరుత దాడి చేస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఈ సీసీటీవీ ఫుటేజ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, గ్రామంలో బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని, తమకు రక్షణ కల్పించాలని సిరిపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

## మహిళాభివృద్ధిలో ఇదో చారిత్రాత్మక నిర్ణయం

## ఉండి మహానాడులో రఘురామ ప్రకటన

**భీమవరం,మే28(ఆర్ఎన్ఎ):** మహానాడు వేడుక వేదికగా రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తామని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించటం చరిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. దీంతో దేశంలో అందరికన్నా ముందుగా మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా ఈ నిర్ణయంతో టీడీపీ గుర్తించబడిందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అద్భుతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో నిర్వహించిన మహానాడులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. రఘురామకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు అంటూ జడ శ్రవణ్ కుమార్ పచ్చి అబద్దాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అతడు ఎన్ని అబద్దాలు ఆడాడో సుప్రీంకోర్టులో రికార్డ్ చేయడం జరిగిందని.. వాటిని చూపిస్తానని చెప్పారు. వాటిని చూసి అతడికి విజ్ఞులైన ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు. ఆకివీడులో ఆలయ నిర్మాణానికి ఒక్కరోజు కూడా ఆలస్యం జరగదని ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు మనకు అనుకూలంగా వస్తుందన్నారు. అందులో ఎటువంటి సందేహము లేదని చెప్పారు. నుకున్న సమయానికి రామాలయాన్ని పూర్తి చేస్తామని శ్రీరామభక్తులకు తెలియజేస్తున్నానన్నారు. తెలుగువీర లేవరా అనే ఫోరంను స్థాపించామని వివరించారు. దీనికి చాలా చక్కటి స్పందన వస్తుందన్నారు. అలాగే తెలుగువీర లేవరా వెబ్‌సైట్ కూడా ఒకటి రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఓట్ల రాజకీయం కోసం మనకెందుకులే అని వదిలేస్తున్న అంశాలను తీసుకుని న్యాయం చేయడమే ఈ తెలుగు వీర లేవరా ఫారం ముఖ్య ఉద్దేశమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ వివరించారు. తాను ప్రాతినిధ్యం వహించే ఉండి నియోజకవర్గంలో అన్ని ప్రార్థన మందిరాలలో లౌడ్ స్పీకర్లు సమూలంగా నిర్మూలించామని చెప్పారు. ప్రజలకు లౌడ్ స్పీకర్ల వల్ల ఇబ్బంది ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోకుంటే.. వారిపై తాము చర్యలు తీసుకుంటామని ప్రజలకు రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ఈ శబ్ద కాలుష్య అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పవన్ కళ్యాణ్ సర్జరీ అయిన తర్వాత రెట్టింపు ప్రోత్సాహంతో పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ ఆయన స్పందిస్తున్న తీరు అత్యంత ప్రశంసనీయమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన తప్పేంటి

## అరెస్ట్ చేస్తామన్న ప్రచారంపై పాశం యాదగిరి ఆగ్రహం

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై ఘాటు విమర్శలు

**హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ):** ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగేశ్వర్ రావు చేసిన విమర్శల్లో అంత తప్పు ఏముందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను ప్రశ్నించారు. కేవలం విమర్శలు చేసినందుకే ఒక మేధావిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిని చేయడమే ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యూహాలపై, గత చరిత్రపై పాశం యాదగిరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ పచ్చగా, లాభసాటిగా ఉంటే అక్కడికి వెళ్లి మేసే పశువు తరహాలో, కేవలం అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే నాయకులు కూడా ఈరోజు నీతులు చెప్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు మరణానికి కారకుడైన వ్యక్తి, ఈరోజు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూర్చోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో మీడియా అక్రిడిటేషన్ల మరియు ఛానల్ల యాజమాన్యాలపై ఆయన సంచలన నిజాలను వెల్లడించారు. స్వరాష్ట్రమైన తెలంగాణలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ప్రస్తుతం మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ల కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో వి6 , టి న్యూస్ మినహాయిస్తే, మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి స్పష్టం చేశారు.

# బక్రీద్ నేపథ్యంలో కీసర టోల్‌ప్లాజా వద్ద పోలీసుల ప్రత్యేక తనిఖీలు...



**నందిగామ మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్ల మండలం కీసర స్వర్ణ టోల్‌ప్లాజా వద్ద బుధవారం పోలీసులు విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున ఎస్ఐ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత పత్రాలను తనిఖీ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి గోవులను అక్రమంగా తరలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కూడా తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను ఆపి పూర్తిగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ విశ్వనాథ్ కోరారు.

# నందిగామలో దొంగల బీభత్సం...



**నందిగామ మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ పట్టణంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా డాక్టర్ వాసుబాబు ఓల్డ్ హాస్పిటల్ సమీపంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సీత ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా పగులగొట్టి సుమారు 150 గ్రాముల బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. ఇంటికి తిరిగి వచ్చిన బాధితులు బీరువా పగులగొట్టబడినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల పట్టణంలో చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# తెలుగువారు ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది..



**కమలానగర్ మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు సిద్ధాంతాలు, లక్ష్యాలతోనే ఈనాటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని ఉమ్మడి అనంతపురం జిల్లా జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఉమ్మడి జిల్లా జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు గర్వించే దిశగా ఈనాడు రాష్ట్రంలో తెలుగుదేశం పరిపాలన సాగిస్తోందన్నారు. తెలుగువాళ్లు ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిస్తూ అభివృద్ధి వైపు రాష్ట్రం మడుగులు వేస్తోందని చెప్పారు.

# బద్వేలులో రెండో రోజు 'మహానాడు'



**గోపవరం మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రెండోరోజు 'మహానాడు'లో భాగంగా తెదేపా శ్రేణులు బద్వేలులో సింహగర్జనతో హోరెత్తించారు. మహానాడు ఇన్‌ఛార్జి, డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పరిశీలకుడు నాగేంద్ర కలిసి మొదట నెల్లూరు రోడ్డులోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా మహానాడు నిర్వహిస్తున్న రాఘవేంద్ర కల్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడారు. పేదల ఆశయాలకు అనుగుణంగా, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం, అభ్యుదయం కోసం ఆనాడు ఎన్టీఆర్ స్థాపించిన తెదేపా.. ఈనాడు వరకు చంద్రబాబు ఆధ్వర్యంలో పేదల అభ్యుదయం కోసం పాటుపడుతోందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు వీరారెడ్డి, నియోజకవర్గ తెదేపా శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఆపరేషన్ అనంతరం వ్యక్తి మృతి.. ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన!



**మదనపల్లి మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆపరేషన్ వికటించి రైతు శ్రీనివాసులు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన మదనపల్లి పట్టణంలోని ఓ ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. రొంపిచర్ల మండలం వారణాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (51) వీపు భాగంలో గడ్డ రావడంతో బుధవారం మదనపల్లిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆపరేషన్ చేశారు. అనంతరం బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆసుపత్రిలో వైద్యం వికటించి అస్వస్థకు గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైద్యులపై గొడవకు దిగారు. అనంతరం మదనపల్లిలోని గుండె వైద్య నిపుణుడి వద్దకు బాధితుడిని తీసుకెళ్లారు. గురువారం ఉదయం వరకు వెంటిలేటర్‌పై ఉన్న శ్రీనివాసులు మృతి చెందారు. మొదట తీసుకెళ్లిన ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాసులు మృతి చెందాడని ఆస్పత్రి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుడి గుర్తింపు రద్దు చేయడంతో పాటు ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



**మడకశిర మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మడకశిరలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ నర్సింగప్ప తెలిపిన వివరాల ప్రకారం, మడకశిరకు చెందిన సతీష్ కుమార్, దేవరాజ్, జబ్బల్ ఇర్ఫాన్, సుధీర్ రెడ్డి అనే నలుగురు వ్యక్తులు వ్యసనాలకు బానిసై, ధనార్జన కోసం క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారంతో వీరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 7 లక్షల 20 వేల నగదుతో పాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# మున్సిపల్ కార్మికులకు సబ్బులు నూనెలు పంపిణీ



**ధర్మవరం మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ధర్మవరం మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, మేస్త్రీలకు 2023-24 మరియు 2024-25 సంవత్సరాలకు సంబంధించిన సబ్బులు, కొబ్బరి నూనెలను గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కార్మికులకు సూచించారు.

# చిత్రకారిణి నాగలక్ష్మీ కుమారి చిత్రాలు మనల్ని పలకరిస్తాయి...

## స్వయంకృషితో పైకి వస్తున్న ఆమెను అభినందిస్తున్నారు...

## భర్త ప్రోత్సాహం వల్లనే తనీస్థితికి రావడానికి కారణం - నాగలక్ష్మీ కుమారి



**మచిలీపట్నం మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏ వ్యక్తి అయినా ఏ రంగంలోనైనా రాణించాలంటే అందుకు తగిన కృషి, పట్టుదల ఉండాలి. కలలు కంటూ కాలక్షేపం చేస్తూ ఉంటే ఫలితాలు ఉండవు. కొందరు గురువుల దగ్గర శిక్షణ పొందుతూ తాను ఎంచుకున్న రంగంలో విశేషంగా కష్టపడుతూ అనుకున్నది సాధిస్తారు. మరికొందరు గురువుల దగ్గర శిక్షణ పొందే అవకాశం లేనివారు తమంతట తాము పుస్తకాలు చదువుతూ ప్రఖ్యాతిగాంచిన మేధావులను స్ఫూర్తిగా తీసుకొని రాణిస్తారు. అతి తక్కువ కాలంలోనే గుర్తింపు పొందుతారు. అటువంటి వారిలో బండి కట్ల నాగలక్ష్మీ కుమారి ఒకరు. చిన్నతనం నుంచి ఆమెకు చిత్రలేఖనంపై అభిరుచి. అభిరుచికి అనుగుణంగానే ఇతర చిత్రకారుల బొమ్మలు చూసి అనుకరిస్తూ పెన్సిల్ తో బొమ్మలు వేయసాగారు. పదవ తరగతి వరకు చదువుకున్న నాగలక్ష్మీకుమారికి వివాహం అయింది. ఆ తర్వాత సంసారం, బాధ్యతలు. భర్త బండి కట్ల సుష్మణాచారి, భార్య అభిరుచిని గమనించి అప్పటివరకు ఆమె చిత్రీకరించిన బొమ్మలను చూసి ప్రోత్సహించాలన్న నిర్ణయం తీసుకున్నారు. అప్పటినుంచి భార్యకు కావలసిన పెన్సిల్లు, రంగులు, కాగితాలు, కార్డు బోర్డు అన్నీ సమీకరించి వెన్నంటి ఉంటూ వచ్చారు. నాగలక్ష్మీ కుమారి భర్త సుష్మణాచారి వడ్రంగి పనిచేస్తూ, తన పనిలో బిజీగా ఉన్న భార్యను ప్రతిరోజూ ఈరోజు ఏ ఏ బొమ్మలు వేశావు.. ఇంకేం బొమ్మలు వేయాలనుకుంటున్నావు.. ఏ రంగులు కావాలి అంటూ అడిగి, కావలసిన వాటిని విజయవాడ నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చేవారు. ఆ దంపతులు మచిలీపట్నంలో ఉంటున్న నాగలక్ష్మీ కుమారికి కావలసిన రంగులు మచిలీపట్నంలో దొరికేవి కావు. ఒక్కోసారి సుష్మణాచారి భార్యను తీసుకొని విజయవాడకు వెళ్లి రంగులు కొనుక్కుని వచ్చేవారు. హాయిగా సాగుతున్న వారి కుటుంబంలో ఒక్కసారిగా పెను చీకటి చోటు చేసుకుంది. చదువుకుంటున్న ఏడు సంవత్సరాల వాళ్ళ బాబును పాము కాటు వేయడంతో చనిపోయాడు. ఒక బాబు, ఒక పాపతో సంతోషంగా ఉంటున్న ఆ కుటుంబంలో బాబు చనిపోవడంతో ఈ లోకమంతా నాగలక్ష్మీ కుమారికి దూరమైనట్లయింది. బాబు ఆలోచనలతో, దిగులుతో మానసికంగా కృంగిపోయింది. అనారోగ్యం పాలయింది. వేళకు తిండి లేదు, చిత్రాల సరంజా అంతా మూలకు వెళ్లిపోయింది. "ఇక ఇంతే ఈ జీవితం"! అనుకుంది. తన కళ్ళేదుట కటికి నేల మీద కూర్చుని చిత్రాలు గీసే భార్య నిర్జీవంగా ఉండటం తట్టుకోలేని భర్త, కుమార్తె తల్లడిల్లిపోయారు మళ్ళీ లక్ష్మీకుమారిని మామూలు మనిషిని చేసి, చిత్రాలు వేసే విధంగా ప్రోత్సహించాలని గతాన్ని మర్చిపోయే విధంగా తీర్చిదిద్దాలనుకున్నారు. నెమ్మదిగా ఆమె ఆరోగ్యం కుదుట పడసాగింది. అల్లికలతో బుట్టలు అల్లడం, మిషన్ కుట్టడం.. ఇలా రోజులు గడుస్తుండగా భర్త, కుమార్తె నాగ లావణ్యలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోగా మళ్లీ చిత్రాలు గీయడానికి ఆసక్తి కనపరచసాగింది. ఇప్పుడు నాగలక్ష్మీ కుమారి తనలో దాగివున్న సృజనాత్మక శక్తితో అనేక చిత్రాలను గీయడం మొదలుపెట్టారు. ఆర్ట్ ఎగ్జిబిషన్లో తన చిత్రాలను ప్రదర్శించడం మొదలుపెట్టారు. నాలుగు, ఐదు సంవత్సరాలలో చిత్రకారుణిగా 300కు పైగా చిత్రాలు గీశారు. ఎక్కువగా ఆమె చిత్రాలు దేవుళ్ళవే కాకుండా ప్రకృతి రమణీయంతో కూడుకున్న చిత్రాలు కూడా ఉండటం విశేషం. సొంతంగా తనకు తాను తీర్చిదిద్దుకున్న చిత్రకారిని నాగలక్ష్మీకుమారి. ప్రస్తుతం ఆర్ట్ లో డిప్లమో చేస్తున్నారు. మూడు సంవత్సరాల కోర్సులో ఇప్పుడు ఆఖరి సంవత్సరం గడుస్తోంది. చిత్రకళా ప్రదర్శనలో ఔత్సికరాలినైన తన చిత్రాలను పలువురు చూసి ప్రశంసిస్తున్నారు.. అభినందిస్తున్నారు. ఆమె చిత్రాలు మనల్ని పలకరిస్తాయి. చూసిన వెంటనే ఆకట్టుకుంటాయి. ఒక చిత్ర కళాకారుణికి అంతకంటే ఇంకేం కావాలి. వారి మనవడు త్రిలోక్ పదవ తరగతి చదువుతున్నాడు. మనవరాలు రాధా అక్షయ మూడవ తరగతి చదువుతోంది. ఆ ఇద్దరు పలు చిత్రకళ పోటీలలో పాల్గొని బహుమతులు పొందుతూ ఆశీస్సులు అందుకుంటున్నారు. చిత్రకారిణి బండికట్ల నాగలక్ష్మీ కుమారి (55) మరింతగా రాణించి ఇంకా ఇంకా పేరు ప్రఖ్యాతులు పొందాలని ఆశిస్తున్నాం

# పల్నాడు జిల్లాలో ఘనంగా 'మహానాడు'



**పల్నాడు మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు మహానాడు కొనసాగింది. పార్టీ ముఖ్య నేతలు, ఎమట?మ్మెల్యేలు, కార్యకర్తలు కలిసి మహానాడును అదే జోష్‌తో నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లాలోని వినుకొండలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెదేపా జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. నల్లగండ్లలోనూ మహానాడును నిర్వహించారు. పిడుగురాళ్లలోని ఐలాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ సభ్యులు జంగా కృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామంలో నిర్వహించిన మహానాడులో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, కర్నూలు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

# కార్యకర్తలకు అండగా తెదేపా



**గండేపల్లి మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తూనే, కార్యకర్తలకు అండగా తెదేపా ఉంటుందని గండేపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జి జాస్తి వసంత్ అన్నారు. గండేపల్లి మండలం మురారి గ్రామంలోని కాకతీయ కల్యాణ మండపంలో డిజిటల్ మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంధన పొదుపులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కార్యకర్తలకు అందుబాటులో ఈ డిజిటల్ మహానాడు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజలకు వివరించారు.

# టి. నర్సాపురంలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**నర్సాపురం మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గురువారం టి. నర్సాపురంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మసీదులో సామూహిక ఈద్ నమాజ్ ఆచరించిన అనంతరం, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ఖుర్బానీ మాంసాన్ని పేదలకు, బంధువులకు పంచిపెట్టారు. అనంతరం సాకిరేవు చెరువు సమీపంలోని ఖబరస్తాన్ వద్ద పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక దువా చేసి నివాళులర్పించారు.

# ధర్మవరం మండలంలో రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం



**ధర్మవరం మే28 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ధర్మవరం మండలం నేలకోట తాండా గ్రామానికి చెందిన వడిత్య శంకర్ నాయక్ ను ధర్మవరం ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుండి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. శంకర్ నాయక్ ను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించారు. అక్రమంగా నాటుసారా తయారుచేసి, అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై నాగరాజు తెలిపారు.




# 'దృశ్యం-4' వైపు లాగే భారీ వసూళ్లు



ఇండియన్ సినిమాలో ఫ్రాంఛైజీ సినిమాల్లో మూడుకు మించి వచ్చిన దాఖలాలు తక్కువ. మన దగ్గర హిట్ సినిమాల సీక్వెల్స్ బాగా ఆడడం తక్కువే. ఒక సినిమా ఆడినా సరే.. మూడోది వచ్చిందంటే ప్రేక్షకులకు మొహం మొత్తేస్తుంటుంది. ముందు సినిమా స్థాయిలో కంటెంట్ ఉండదు. ప్రేక్షకులకు కూడా మోనాటనస్ ఫీలింగ్ వచ్చి రెండో సినిమాకో, మూడో సినిమాకో దండం పెట్టేస్తుంటారు. దీంతో అక్కడితో బ్రేక్ పడిపోతుంటుంది. ఐతే 'దృశ్యం' ఫ్రాంఛైజీలో మాత్రం రెండో సినిమా అద్భుత స్పందన తెచ్చుకుని, మూడో చిత్రానికి దారిచ్చింది. కానీ ఇటీవలే విడుదలైన 'దృశ్యం-3' మాత్రం కంటెంట్ పరంగా తీవ్రంగా నిరాశపరిచింది. ఈ సినిమా చూసిన ఏ ప్రేక్షకుడూ సంతృప్తి చెందలేదు. దృశ్యం, దృశ్యం-2 చిత్రాలకు ఇది దరిదాపుల్లో కూడా లేదనే విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. కానీ సీక్వెల్ హైప్ వల్ల ఈ సినిమాకు వసూళ్ల విషయంలో మాత్రం ఢోకా లేదు. టాక్‌తో సంబంధం లేకుండా భారీ ఓపెనింగ్స్ రాబట్టిన 'దృశ్యం-2'.. వీకెండ్ తర్వాత కూడా ఆగడం లేదు. డబ్బింగ్ వెర్షన్ పెద్దగా వర్కవుట్ కాలేదు కానీ మలయాళ వెర్షన్ మాత్రం అన్ని చోట్లా బాగా ఆడుతోంది. కేరళలో అయితే వీక్ డేస్‌లో కూడా సినిమాకు హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. మోహన్ లాల్ స్టార్ పవర్‌కు తోడు దృశ్యం ఫ్రాంఛైజీకి ఉన్న వాల్యూ బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేస్తోంది. విదేశాల్లో కూడా ఈ సినిమా బాగా ఆడుతోంది. విడుదలైన ఆరు రోజులకే ఈ చిత్రం రూ.200 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును అందుకోవడం విశేషం. మలయాళంలో ఈ మార్కును అందుకున్న సినిమాలు పది కూడా లేవు. ఈ ఊపు చూస్తుంటే.. 'దృశ్యం-3' ఫుల్ రన్లో రూ.300 కోట్ల మార్కును కూడా అందుకుని, లోక పేరిట ఉన్న ఆల్ టైం హైయెస్ట్ గ్రాసర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు లేకపోలేదు. ఈ చిత్రం ఇంత పెద్ద హిట్ అయిన నేపథ్యంలో 'దృశ్యం-4'కు రంగం సిద్ధమైనట్లే. మోహన్ లాల్, జీతు జోసెఫ్ ఆ దిశగా టెంప్ట్ కాకుండా ఎలా ఉండగలరు?

# చిరు సినిమాను చంపేసుకుంటున్నారు



ఈ రోజుల్లో పెద్ద హీరోల సినిమాలు ఆలస్యం కావడం, రిలీజ్ డేట్ వాయిదా పడడం చాలా కామన్ విషయం. ఇంతకుముందులా సినిమాను వాయిదా వేయాల్సి వస్తే చిత్ర బృందాలు ఎక్కువ కంగారు పడడం లేదు. ఆడియన్స్ కూడా ఎక్కువ అసంతృప్తి వ్యక్తం చేయట్లేదు. ఇది మామూలు విషయమే అన్నట్లు అందరూ వ్యవహరిస్తున్నారు. కానీ ప్రేక్షకులు అలవాటు పడ్డారు కదా అని.. మరీ గ్రాంటెడ్‌గా తీసుకుంటే, ఏళ్లకు ఏళ్లు సినిమా ఆలస్యం అయితే.. మళ్లీ మళ్లీ రిలీజ్ డేట్ మార్చుకుంటూ పోతే పూర్తిగా ఆసక్తి సన్నగిల్లిపోవడం ఖాయం. పవన్ కళ్యాణ్ సినిమాలు హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ మీద ఎలా రిలీజ్ ముంగిట బజ్ కోల్పోయాయో తెలిసిందే. వీటికి ఆశించిన ఓపెనింగ్స్ కూడా రాని పరిస్థితి. ముందే అందరూ ఇవి ఫ్లాప్ అనే నిర్ణయానికి వచ్చేశారు. ఈ సినిమాలు చూడ్డానికి పవన్ అభిమానులు ఎప్పట్లాగే ఉత్సాహం చూపించినా, సామాన్య ప్రేక్షకుల్లో అయితే కనీస ఆసక్తి కూడా కనిపించలేదు. అందుకే ఆ చిత్రాలు డిజాస్టర్లుగా మిగిలాయి. ఈ అనుభవం కళ్ల ముందే కనిపిస్తున్నా.. 'విశ్వంభర' సినిమా విషయంలో మేకర్స్ జాగ్రత్త పడడం లేదు. క్వాలిటీ విషయంలో రాజీపడకపోవడం మంచిదే. తొలి టీజర్లో వీఎఫెక్స్ మీద తీవ్ర విమర్శలు వచ్చాయని, వాటి మీద మళ్లీ భారీగా ఖర్చు పెట్టి వర్క్ చేయించడాన్ని అర్థం చేసుకోవచ్చు. ఔట్ పుట్ కోసం ఆలస్యం జరుగుతోందంటే అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకులూ అర్థం చేసుకుంటారు. కానీ ఆ ఆలస్యం శ్రుతి మించితే అసహనం తప్పదు. గత ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'కు దారి ఇస్తూ తమ చిత్రాన్ని వేసవికి రిలీజ్ చేస్తామన్నారు. కానీ వేసవి వచ్చింది, వెళ్లిపోతోంది. కానీ 'విశ్వంభర' గురించి ఏ ఊసూ లేదు. 'మన శంకర వరప్రసాద్ గారు'తో చిరు కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్ దక్కింది. దీని తర్వాత వీలైనంత త్వరగా 'విశ్వంభర'ను రిలీజ్ చేస్తే ప్రయోజనం ఉండేది. ఆటోమేటిగ్గా బజ్ క్రియేట్ అయ్యేది. కానీ మేకర్స్ ఆ పని చేయలేదు. వీఎఫెక్స్ కోసం సంవత్సరాల తరబడి పని చేస్తూనే ఉన్నారు. ఎంతకీ ఆ వర్క్ కొలిక్కి వస్తున్నట్లు లేదు. కానీ క్వాలిటీ సంగతేమో కానీ.. సినిమా నుంచి ఏ అప్‌డేట్ లేకపోవడం, ఎంతకీ రిలీజ్ సంగతి తేల్చకపోవడంతో ప్రేక్షకులు 'విశ్వంభర' మీద పూర్తిగా ఆసక్తి కోల్పోతున్న పరిస్థితి. ఇటీవలే చిరంజీవి కొత్త సినిమాను మొదలుపెట్టారు. దాని గురించి అభిమానులు ఎగ్జైట్ అయ్యారు తప్పితే.. విశ్వంభర మీద వారికి ఆశలే లేనట్లున్నాయి.

# 'పెద్ది'ని తెగ లేపేస్తున్న బాబు!



జూన్ 4 దగ్గరికొస్తోంది. ముందు రోజు ప్రీమియర్లు దాదాపు ఖరారైపోయినట్టే. రెండు ప్రభుత్వాల నుంచి అనుమతులు వస్తే షోలు ప్రకటించడానికి టీమ్ సిద్ధంగా ఉంది. ప్రమోషన్లు కంటిన్యూగా జరుగుతూనే ఉన్నాయి. ముంబై ట్రైలర్ లాంచ్ సక్సెస్ కాగా భోపాల్ ఈవెంట్ మంచి రీచ్ తెచ్చుకుంది. బెంగళూరు ప్రెస్ మీట్ కొంచెం హడావిడిగా ముగిసింది. ఢిల్లీలో జ్యూక్ బాక్స్ రిలీజ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలలో తాజాగా జగపతిబాబు అందుబాటులోకి వచ్చారు. లెజెండ్ తర్వాత తనకు బెంచ్ మార్క్ గా అనిపించిన సినిమాలు అయిదారు మాత్రమే ఉన్నాయని వాటిలో పెద్ది అగ్ర స్థానాన్ని తీసుకుంటుందని జగపతి బాబు చెప్పిన మాటలు ఒక్కసారిగా అంచనాలు పెంచేశాయి. చాలా డెప్త్, ఎమోషన్స్ తో పాటు పెర్ఫార్మన్స్ డిమాండ్ చేసే ఇలాంటి పాత్ర చేయడం, బుచ్చిబాబు లాంటి దర్శకుడితో పని చేయడం గురించి ఆయన చాలా గొప్పగా చెబుతున్నారు. రామ్ చరణ్ మీద పొగడ్తల వర్షం కురిపించడం వైరల్ అవుతోంది. ఇంత ప్రత్యేకంగా జగపతిబాబు ఎలివేషన్ ఇవ్వడం వెనుక కారణం లేకపోలేదు. పెద్దిలో ఆయన పోషించిన అప్పలసూరి పాత్ర ఫస్ట్ హాఫ్ లో చాలా కీలకంగా నిలవనుంది. ఊరికొచ్చిన ఒక పెద్ద సమస్య కోసం ఆయన చేసే యుద్ధమే పెద్దిని రకరకాల ఆటల బరిలో దిగేలా చేస్తుంది. తండ్రి కోసం కొడుకు ఏం చేశాడనే పాయింట్ తో పాటు అసలు అంతమంది ఊరోళ్ళ కోసం వీళ్ళిద్దరూ ఎందుకు అంత పోరాటం చేశారనేది పెద్దికి సంబంధించిన ముఖ్యమైన స్టోరీ డ్రైవ్. కేవలం కమర్షియల్ అంశాల మీదే దృష్టి పెట్టకుండా భావోద్వేగాలకు తగినంత చోటు ఇచ్చిన దర్శకుడు బుచ్చిబాబు పెద్దిని తీసిన విధానం ఖచ్చితంగా అవార్డులు తెచ్చి పెడుతుందనే ధీమా క్యాస్టింగ్ తో పాటు సాంకేతిక నిపుణుల్లోనూ కనిపిస్తోంది. లుక్ పరంగా చాలా షాకింగ్ మేకోవర్ కు వెళ్ళిపోయిన జగపతిబాబు ఈసారి అప్పలసూరిగా అదరగొట్టడం ఖాయమని ఇన్ సైడ్ టాక్. రంగస్థలంలో నెగటివ్ క్యారెక్టర్ అయితే జగపతిబాబు ఇందులో పూర్తి పాజిటివ్ ఫాదర్ గా కనిపించేనున్నారు

# బ్లాక్‌బస్టర్ కొట్టాడు.. కొత్తది ఫిక్స్ చేశాడు



ఒక బ్లాక్ బస్టర్ హిట్ కోసం పుష్కరం కంటే ఎక్కువ కాలం నుంచి ఎదురు చూస్తున్నాడు తమిళ స్టార్ హీరో సూర్య. 2013లో వచ్చిన 'సింగం-2' ఆయన చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత కొన్ని సినిమాలు ఒక మాదిరిగా ఆడాయి కానీ.. నిఖార్సయిన హిట్లు కాలేదు. సినిమా సినిమాకూ వసూళ్లు పడిపోతుండడంతో ఆయన అభిమానుల వేదన అంతా ఇంతా కాదు. వెయ్యి కోట్లు గ్యారెంటీ అనుకున్న 'కంగువ' అందులో పదో వంతు వసూళ్లు కూడా రాబట్టలేకపోవడంతో సూర్య పనైపోయిందనే నిర్ణయానికి వచ్చేశారందరూ. ఇలాంటి టైంలో పెద్దగా అంచనాలు లేకుండా వచ్చిన 'కరుప్పు' (తెలుగులో వీరభద్రుడు) సినిమా ఊహించని విజయాన్నందుకుంది. యావరేజ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ ఈ సినిమాకు వసూళ్ల విషయంలో ఢోకా లేకపోయింది. రూ.300 కోట్ల గ్రాస్ వసూళ్ల దిశగా సాగుతున్న ఈ చిత్రం.. సూర్య కెరీర్లో హైయెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఈ ఊపులో తన కొత్త సినిమా రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేయించేశాడు సూర్య. 'కరుప్పు' తర్వాత సూర్య చేస్తున్నది తెలుగు సినిమా కావడం విశేషం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రమే.. విశ్వనాథ్ అండ్ సన్స్. ఇంతకుముందు వెంకీ దర్శకత్వంలో రంగ్ దె, సార్, లక్కీ భాస్కర్ చిత్రాలు నిర్మించిన సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నాడు. ఆల్రెడీ చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సరైన రిలీజ్ డేట్ కోసం చూస్తోంది. 'కరుప్పు' రిలీజ్ కోసం ఆగిన టీం.. ఆ సినిమా విడుదలై బ్లాక్ బస్టర్ కావడంతో విడుదల ఖాయం చేసుకుంది. ఇండిపెండెన్స్ డే వీకెండ్లో, ఆగస్టు 14న 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రేక్షకుల ముందుకు రానుంది. లాంగ్ వీకెండ్‌ను ఉపయోగించుకునేలా పర్ఫెక్ట్ డేట్ ఎంచుకుంది టీం. ఈ క్రేజీ వీకెండ్‌కు వివిధ భాషల్లో పేరున్న సినిమాలు రిలీజవుతుంటాయి.



# బిజినెస్ న్యూస్



## టాటా కొత్త టియాగో, టియాగో ఈవీ వచ్చేశాయ్.. ధర, ఇతర వివరాలు ఇవీ..




ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ తదుపరి తరం టియాగో, టియాగో ఈవీని దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. ఈ ఎంట్రీ లెవల్ హ్యాచ్‌బ్యాక్ ధరను రూ.4.69 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. ఎలక్ట్రిక్ వెహికల్ ధరను రూ.6.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా పేర్కొంది. ఇదే టియాగో ఈవీని బ్యాటరీ అద్దె ప్రాతిపదికన (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) తీసుకుంటే రూ.4.69 లక్షలుం కిలోమీటరుకు రూ.2.6 చొప్పున చెల్లించాలి. ఐసీఎన్‌జీ వెర్షన్ ధరను రూ.5.79 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. కొత్త టియాగోలో డిజైన్, ఇంటీరియర్, ఫీచర్ పరంగా చాలా వరకు మార్పులు చేపట్టారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, హ్యూందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి మోడళ్లకు పోటీ ఇచ్చేందుకు అవసరమైన మార్పులు చేశారు. ఐ బ్రో స్టైల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, డీఆర్‌ఎల్స్ ఇచ్చారు. వెనుక వైపు కూడా ఎల్‌ఈడీ టెయిల్‌లైట్స్ ఇచ్చారు. 15 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. టియాగో ఈవీలో కూడా ఇంచుమించు ఐస్ మోడల్ డిజైన్‌నే కొనసాగించారు ఇక ఇంటీరియర్ విషయానికొస్తే.. ఇందులో 2 స్పోక్ స్టీరింగ్ వీల్ ఇచ్చారు. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ సెంటర్ ఉంది. డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జర్, 360 డిగ్రీల కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటర్, రియర్ ఏసీ వెంట్స్, క్రూయిజ్ కంట్రోల్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, ఆటో హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సేఫ్టీ పరంగా ఆరు ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, హిల్ హోల్డ్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. టియాగోలో 1.2 లీటర్ నాచురల్ యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 86 హెచ్‌పీ పవర్‌ను, 113 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సీఎన్‌జీలోనూ 1.2 లీటర్ ఇంజిన్ అమర్చారు. ఇది 74 హెచ్‌పీ పవర్‌ను, 96 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఏఎంటీ ఆప్షన్లలో లభిస్తాయి. ఇక టియాగో ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లలో లభిస్తుంది. 19.2 ఎఔష్త్ర బ్యాటరీ సామర్థ్యం కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 205 కిలోమీటర్లు, 24ఎఔష్త్ర బ్యాటరీ వేరియంట్‌తో 215 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. 3.3ఎఔ పోర్టబుల్ ఛార్జర్, 7.2ఎఔ హోమ్ ఛార్జర్, 30ఎఔ డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ ఆప్షన్లతో లభిస్తుంది.

## సగానికి తగ్గిన వెంచర్ ఇన్వెస్ట్‌మెంట్స్




వెంచర్ క్యాపిటల్, ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) ఫండ్స్ పెట్టుబడులు గత నెలలో సగానికి క్షీణించాయి. వెరసి ఏప్రిల్‌లో 38 డీల్స్ ద్వారా 2.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా డాలరుతో మారకంలో రూపాయి క్షీణత, రాజకీయ భౌగోళిక ఆందోళనలు దెబ్బతీశాయి. ఐవీసీఏ, కన్సల్టెన్సీ సంస్థ ఈవై విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025 ఏప్రిల్‌తో పోలిస్తే విలువలో 50 శాతం తగ్గాయి. 2026 ఏప్రిల్‌లో 83 లావాదేవీలు నమోదయ్యాయి. ఇవి 29 నెలల కనిష్టంకాగా.. గతేడాది ఏప్రిల్‌లో 134, ఈ ఏడాది మార్చిలో 131 ట్రాన్సాక్షన్స్ జరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 96 స్థాయికి పడిపోవడం, అధికస్థాయిలలో కొనసాగుతున్న ముడిచమురు ధరలు, రాజకీయ భౌగోళిక ఆందోళనలు పెట్టుబడులను ప్రభావితం చేసినట్లు ఈవై పార్ట్‌నర్ వివేక్ సోనీ పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రుడెన్సియల్ ఆల్టర్నేటివ్స్ 28.3 కోట్ల డాలర్ల పెట్టుబడులు గత నెలలో నమోదైన అతిపెద్ద డీల్‌గా నివేదిక తెలియజేసింది. బెంగళూరు, పుణేలలో ఆర్ఎంజెడ్ కార్యాలయ ఆస్తులలో ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించింది.


## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి బుల్లెట్ 650.. ధర ఎంతంటే?



ప్రముఖ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 650ని దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.3,64,856 (ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. కెనాన్ బ్లాక్, బ్యాటిల్‌షిప్ బ్లూ రంగుల్లో లభిస్తుంది. ఇప్పటికే 650 సీసీ సెగ్మెంట్‌లో మెటోర్ 650, షాట్‌గన్ 650, క్లాసిక్ 650, ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జీటీ 650 పేరుతో వివిధ మోడళ్లను రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయిస్తోంది. తాజాగా బుల్లెట్ 650 ఆ జాబితాలో చేరింది. బుల్లెట్ 650 చూడ్డానికి బుల్లెట్ 350ని పోలి ఉంటుంది. ఇందులో ఐకానిక్ రౌండ్ హెడ్‌ల్యాంప్, టైగర్ ఐ లైట్స్, టియర్ డ్రాప్ ఆకారంలో ఉండే ట్యాంక్ ఉన్నాయి. సింగిల్‌పీస్ సీట్ ఇచ్చారు. 647.95 సీసీ ఎయిర్, ఆయిల్ కూల్డ్ ప్యార్‌లల్ ట్విన్ ఇంజిన్ ఉంది. ఇది 46.4 బీహెచ్‌పీ పవర్‌ను, 52.3 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ముందువైపు టెలిస్కోపిక్ ఫోర్క్స్, వెనుకవైపు ట్విన్ షాక్ అబ్జార్బర్స్ ఉన్నాయి. ముందువైపు 19 అంగుళాలు, వెనుక వైపు 18 అంగుళాల స్పోక్ వీల్స్ ఇచ్చారు. డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్‌తో కూడిన 320 ఎంఎం ఫ్రంట్, 300 ఎంఎం రియర్ డిస్క్‌బ్రేక్ సెటప్ ఉంది. సెమీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటల్ క్లస్టర్, చిన్న డిజిటల్ డిస్‌ప్లే, గేర్ పొజిషన్ ఇండికేటర్, ఫ్యూయల్ గేజ్, ట్రిప్ మీటర్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, ట్రిప్ నావిగేషన్ పాడ్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

## ఉద్యోగులకు ఆ కంపెనీ బంపరాఫర్..

### 30 శాతానికిపైగా బోనస్




ఏఐ బూమ్‌తో సెమీ కండక్టర్ రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చిపడుతుండటంతో తైవాన్ సంస్థ టీఎస్ఎంసీ (ఖావీజ) మార్కెట్ విలువ అమాంతం పెరిగింది. దాంతో ఈ కంపెనీ తమ ఉద్యోగులకు బంపరాఫర్ ప్రకటించింది. ప్రాఫిట్ షేరింగ్ బోనస్‌ను 30 శాతానికిపైగా పెంచుతున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సి.సి.వీయ్ వెల్లడించారు. మే 29న ఆ బోనస్‌లు ఇవ్వనున్నారు. సీనియారిటీ, గ్రేడ్, ప్రదర్శన ఆధారంగా ఈ మొత్తంలో మార్పులు ఉంటాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి టీఎస్ఎంసీ ఆదాయంలో 30 శాతం వృద్ధిని నమోదు చేసింది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ).. ఎన్విడియా, యాపిల్ వంటి దిగ్గజ సంస్థలకు అధునాతన ప్రాసెసర్లను సరఫరా చేస్తోంది. రెవెన్యూ, తయారీపరంగా ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ ఇది. మార్కెట్ విలువ ప్రకారం తొలిస్థానం ఎన్విడియాది. ఇటీవల తైవాన్ స్టాక్ మార్కెట్ భారత్ దలాల్ స్ట్రీట్‌ను దాటి ఐదో స్థానంలో నిలిచిని సంగతి తెలిసిందే. అందుకు ఈ సంస్థే ప్రధాన కారణం. కృత్రిమ మేధ విస్తరిస్తుండటంతో భవిష్యత్తులో తమ ఉత్పత్తులకు డిమాండ్ కొనసాగుతుందనే విశ్వాసమే.. లాభాల్లో మెరుగైన వాటాను ఉద్యోగులతో పంచుకోవడానికి కారణంగా కనిపిస్తోంది.

## వైద్య రంగంలోకి బజాజ్ గ్రూప్




బజాజ్ గ్రూప్ ఆరోగ్య సంరక్షణ సేవల్లోకి అడుగు పెడుతోంది. రూ.2,000--2,500 కోట్లతో వచ్చే మూడేళ్ల కాలంలో పుణెలో హాస్పిటల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు బజాజ్ ఇంటెగ్రేటెడ్ హెల్త్ సిస్టమ్ ఎండీ నీరవ్ బజాజ్ ప్రకటించారు. వచ్చే దశాబ్ద కాలంలో 12 పట్టణాల్లోకి సేవలను విస్తరిస్తామని తెలిపారు. క్లినిక్‌లు, అంబులేటరీ సేవలు, హోమ్‌కేర్ (ఇంటివద్దే వైద్య సేవలు), హాస్పిటల్‌తో కూడిన ఆరోగ్య సంరక్షణ నమూనాను రూపొందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు చెప్పారు. వ్యాధుల నివారణ నుంచి తక్షణ చికిత్స వరకు ఆస్పత్రికి దూరంగా సేవలను అందించాలని అనుకుంటున్నట్టు పేర్కొన్నారు. తమ ఆరోగ్య సంరక్షణ నమూనా చాలా భిన్నమైందంటూ దీన్ని సొంతంగానే నిర్మింకుంటామని చెప్పారు. పడకల సంఖ్య, ఒక్కో పడకవారీ ఆదాయం తదితర సంప్రదాయ కొలమానాలను తాము అనుసరించబోమన్నారు. ప్రస్తుతమున్న హాస్పిటల్స్‌ను కొనుగోలు చేసే ఉద్దేశ్యం లేదన్నారు.

# టీడీపీ కి దూరంగా ఉన్నా.."అన్న" విధానాలకు కట్టుబడి ఉన్నా



- తప్పు ఎవరు చేసినా ప్రశ్నించే నైజం ఎన్టీఆర్ నుంచే అలవరింది
- తన ఆఖరి రక్తపు చుక్క వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం
- ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్

**విశాఖపట్నం, మే 28 (నేటి మనదేశమ్) :** తాను తెలుగు దేశం పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ.. తెలుగు దేశం విధానాలకు ఎల్లపుడూ కట్టుబడి ఉంటానని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ అన్నారు. తెలుగు జాతి ఆత్మ గౌరవం, విశ్వ విఖ్యాత నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నందమూరి తారక రామారావు 103వ జయంతిని గురువారం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించారు. ఇదే క్రమంలో విశాఖ సాగర తీరంలోని (ఆర్కే బీచ్) ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి బి.వి.రామ్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ కూడు, గూడు, ఉపాధి కల్పించాలన్న అన్న ఎన్టీఆర్ స్పూర్తితోనే తెలుగు శక్తి కృషి చేస్తోందన్నారు. తప్పు ఎవరు చేసినా ప్రశ్నించే నైజం తనకు ఎన్టీఆర్ నుంచే అలవరిందన్నారు. గతంలో వైసీపీని తప్పుదాలను ఎలా ఎండగట్టానో.. ప్రస్తుతం తెలుగు దేశం తప్పులను కూడా వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. గతంలో తెలుగు దేశం పార్టీ నాదే అని భావించాను.. పార్టీ కష్ట కాలంలో నాటి ప్రజా కంటక వైసీపీ పై పోరాటాలు చేశాను. కానీ ఏనాడూ పదవుల కోసం పాకులాడ లేదు అని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కూడా ఎవరికీ భయపడేది లేదన్నారు. తన ఆఖరి రక్తపు చుక్క వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం కొన సాగుతుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసే ప్రజలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ వి.ఉమామహేశ్వర రావు, డాక్టర్ పప్పూర్ నికుంజ్, ఫిలిం డైరెక్టర్ వి.వంశీ బాబు, వేగి రాధాకృష్ణ, దాడి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ముస్లింల ప్రయోజనార్థం ఎకరా స్థలం కేటాయించాలి**

ముస్లింల ప్రయోజనార్థం ఎకరా స్థలం కేటాయించాలని ముఖ్య



మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. బక్రీద్ సందర్భంగా నగరంలోని న్యూ కాలనీ ప్రాంతంలో ఉన్న హోటల్ సింకా గ్రాండ్ లో ముస్లింలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. ముస్లింల సౌకర్యార్థం ఒక ఎకరా భూమిని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రస్తుతం కొనసాగుతున్న మహానాడులో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను బి.వి.రామ్ కోరారు.

# శృంగవరపుకోట నియోజకవర్గంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## - నివాళులర్పించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



**కొత్తవలస, మే 28 (నేటి మనదేశమ్) :** తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) జయంతి వేడుకలు ఎస్.కోటలో గల అన్ని మండల కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ కోట,ఎల్ కోట, ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఉన్న అన్నగారి విగ్రహానికి నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పూలమాలలు వేసి ఘనంగా కొత్తవలస మండల కేంద్రంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలో అర్పించారు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మీడియాతో మాట్లాడుతూ, "సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్ళు" అనే నినాదంతో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పరిపాలన సాగించారని భారతదేశ చరిత్రలో తొలిసారిగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన తొలి ముఖ్యమంత్రి అని కొనియాడారు. తెలుగువారి కీర్తిని ప్రపంచవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు నేటికీ పేదల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నగారు వేసిన అడుగుజాడల్లో నడుస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో మన శృంగవరపుకోట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాము కట్టుబడి ఉన్నామని నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి కన్వీనర్లు, భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని అన్నగారికి ఘన నివాళులు అర్పించారు.

# వైజాగ్ వైద్యుడికి అంతర్జాతీయ గౌరవం

## ప్యారిస్‌లో జరిగిన 'యూరోపీసీఆర్ 2026' సదస్సులో క్లిష్టమైన గుండె ఆపరేషన్ల వివరాలను సమర్పించిన

## కిమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గణేష్ కాశినాధుని




**విశాఖపట్నం మే 28 (నేటి మనదేశమ్) :** విశాఖపట్నం నగరానికి గర్వకారణంగా నిలుస్తూ, సీతామ్మధారలోని కిమ్స్ హాస్పిటల్స్ చీఫ్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గణేష్ కాశినాధుని ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ వేదికపై ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరంలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రంగంలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, ప్రముఖమైన సదస్సులలో ఒకటిగా గుర్తింపు పొందిన "యూరోపీసీఆర్ (జుబతీశ్రీజ=) 2026" ఘనంగా జరిగింది. ఈ అంతర్జాతీయ సదస్సులో, కిమ్స్ సీతామ్మధార హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించిన రెండు అత్యంత సవాలుతో కూడిన, క్లిష్టమైన గుండె చికిత్సల వివరాలను డాక్టర్ గణేష్ విజయవంతంగా సమర్పించారు. గుండెలోని ప్రధాన ఎడమ ధమని (లెఫ్ట్ మెయిన్ స్టెమ్), దాని అనుబంధ నాళాలలో తీవ్రమైన క్యాల్షియం పేరుకుపోయిన (క్రిటికల్లీ కాల్సిఫైడ్) బ్లాకేజీలకు అధునాతన సాంకేతిక పద్ధతులతో చేసిన చికిత్స విధానాలను ఆయన తన ప్రెజెంటేషన్ల ద్వారా వివరించారు.వైజాగ్‌కు చెందిన ఈ ప్రముఖ వైద్యుడు సమర్పించిన చికిత్సా విధానాలలో... గుండె నాళాల లోపలి భాగాలను స్పష్టంగా చూసేందుకు ఓసీటీ, ఐవూస్ వంటి అధునాతన ఇంట్రావాస్కులర్ ఇమేజింగ్ పద్ధతులను ఉపయోగించారు. వీటితో పాటు క్యాల్షియం నిల్వలను తొలగించేందుకు రొటేషనల్ అథెరెక్టమీ (రోటాబ్లేషన్), ఇంట్రావాస్కులర్ లిథోట్రిప్సీ (IVL), ప్రత్యేకమైన బెలూన్ల వంటి అత్యాధునిక క్యాల్షియం మాడిఫికేషన్ సాంకేతికతలను సమర్థవంతంగా జోడించిన తీరును వివరించారు. ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ అవసరం లేకుండా, ఇటువంటి అధునాతన సాంకేతికతలతో అత్యంత ప్రమాదకరమైన, తీవ్రమైన బ్లాకేజీలను ఎలా విజయవంతంగా నయం చేయవచ్చో చూపించిన ఈ ప్రెజెంటేషన్లు అంతర్జాతీయ వైద్య నిపుణుల నుండి విశేష ప్రశంసలు అందుకున్నాయి. ప్రతిష్టాత్మకమైన ఈ "యూరో పీసీఆర్" అంతర్జాతీయ వేదికపై డాక్టర్ గణేష్ కాశినాధుని ప్రెజెంటేషన్ ఇవ్వడం ఇది వరుసగా మూడో ఏడాది కావడం విశేషం. ఈ అరుదైన హ్యాట్రిక్ విజయం ఇంట ర్వెన్షనల్ కార్డియాలజీ రంగంలో ఆయనకున్న అద్భుతమైన ప్రతిభను, నిరంతర కృషిని మరియు రోగుల సంరక్షణ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని స్పష్టం చేస్తోంది. ఇంతటి క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేసి, అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడం ద్వారా కిమ్స్ హాస్పిటల్స్ (సీతామ్మధార) ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ బృందం యొక్క అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం మరోసారి నిరూపితమైంది. అత్యంత ప్రమాదకరమైన గుండె జబ్బుల అత్యవసర పరిస్థితులను స్థానికంగానే ఎదుర్కొనేందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతికత, ఆధారిత చికిత్సా విధానాలు (ఎవిడెన్స్ బేస్డ్ ట్రీట్‌మెంట్) వైజాగ్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని ఈ ఘటన చాటిచెప్పింది.

విశాఖపట్నం పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రపంచ స్థాయి గుండె చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడానికి, రోగులకు మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడానికి కిమ్స్ హాస్పిటల్స్ కట్టుబడి ఉందని ఈ మైలురాయి మరోసారి నిరూపించింది.

# గొల్లగుంటలో ఘనంగా బక్రీద్ వేడుకలు



**పరవాడ (అనకాపల్లి జిల్లా), మే 28 (నేటి మనదేశమ్) :** పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధిలోని గొల్లగుంట గ్రామంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించి దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామంలోని మసీదులో మత పెద్దలు బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. త్యాగం, సేవ భావానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి సందడి చేశారు.

## నేడు తునిలో

# వన్ మంత్ - వన్ విలేజ్- ఫోర్ విజిట్స్ కార్యక్రమం



**కాకినాడ, మే 28 (నేటి మనదేశమ్) :** ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న తుని మండలం ఎంపీడీవో కార్యా లయంలో ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు జిల్లాలో ప్రతి శుక్రవారం నిర్వహించు న్నామని అన్నారు. ఈ నెల 29న శుక్రవారం తుని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 9:30 నిమిషాలకే తుని ఎంపీడీవో కార్యా లయానికి విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మే 30న కలెక్టరేట్లో జాబ్ మేళా

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
- జిల్లా ఉపాధి అధికారి సి హెచ్ శిరీష



**రాజమహేంద్రవరం, 28 (నేటి మనదేశమ్) :** తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి హెచ్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రూరల్ కలెక్టర్ ప్రాంగణంలో మే 30వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుందని అన్నారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలైన లైన్ స్పయర్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, రవళి స్పిన్నర్స్, దాగూర్ లాబోరేటోరీస్, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్, కియా మోటార్స్, లార్సెన్ & టర్బో, ఆకాశం హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్, మెడ్ ప్లస్, టీమ్ లీజ్ సంస్థలలో పలు రకాల పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఏదైనా డిగ్రీ, ఎంబీబీఎస్, ఫార్మసీ, నర్సింగ్, ఎంబీఏ పూర్తి చేసి, అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుండి 32 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా employment.ap.gov.in లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకుని, రెజ్యూమ్, ఆధార్ కార్డు, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి శిరీష తెలిపారు.

# ఇడి దాడులకు నిరసనగా కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా



**కాకినాడ, 28 (నేటి మనదేశమ్) :** కేరళం మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ నివాసాలపై కేంద్ర ప్రభుత్వ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.) దాడులకు నిరసనగా సిపిఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేషబాబ్జి, నగర కమిటీ సభ్యుడు కె. సత్తిరాజు లు మాట్లాడుతూ బిజెపి వాషింగ్ మెషిన్ రాజకీయాలు మానుకోవాలని దుయ్యబట్టారు. బిజెపి అవినీతి, కుంభకోణాల బండారాన్ని సిపిఎం బయట పెడుతుందని హెచ్చరించారు. మోడీ అధికారం చేపట్టిన 12 ఏళ్ళ కాలంలో ఇ.డి., సిబిఐ, ఎన్.ఐ.ఎ. వంటి రాజ్యాంగ వ్యవస్థలను ప్రతిపక్ష పార్టీల నేతలపై దాడులకు, లొంగదీసు కోవడానికి దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఇతర పార్టీల్లో ఉన్నప్పుడు అవినీతిపరులు, బిజెపి లో చేరగానే సచ్చీలురుగా మారిపోతారా అని ప్రశ్నించారు. బిజెపి ఆగడాలను ఈదేశ ప్రజలు సాగనివ్వరని, వారికి ప్రజలు గుణ పాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ధర్నాకు సంఘీ భావం తెలిపిన అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతిపక్షాలను, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని, మీడియా గొంతు నొక్కడమే బిజెపి విధానంగా ఉందన్నారు. బిజెపి రాజ్యాంగం ప్రకారం నడుచుకోకుండా, నిరంకుశంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బిజెపి అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, దుంపల ప్రసాద్ లతో పాటు చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, ఎం. హరనాథ్, కె. వీరబాబు, అనపర్తి ఏడుకొండలు,సి.హెచ్. సతీష్ ,కె. చిట్టిబాబు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కక్ష సాధింపు చర్యలను తిప్పి కొడతాం




**తాడేపల్లి, 28 (నేటి మన దేశమ్) :** కక్ష సాధింపు చర్యతో సిపిఎం కేరళ మాజీ సీఎం విజయన్ ఇంటి పై ఈడి దాడులు చేయడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి అన్నారు. విజయన్ ఇంటిపై బిజెపి, ఈ డి దాడులను ఖండిస్తూ గురువారం ఎం టి ఎం సీ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ముమ్మాటికి కేంద్ర బిజెపి పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అనంతరం అధికారాన్ని అడ్డుపెట్టుకొని సిపిఎం నాయకుల పై దాడులు చేసేందుకు కుట్ర పన్నిందని ఆయన విమర్శించారు.

